# హరి కథ

హరికథ యక్షగానం నుండి ఆవిర్భవించిందని పరిశోధకుల అభిప్రాయం. హరికథా రూపానికి ఆద్యుడు శ్రీ ఆదిభట్ల నారాయణదాసు గారు. పాట రూపంలో ఉండే యక్షగానాన్ని శ్రీ నారాయణ దాసు గారు కీర్తన, పద్యం, సంగీత, సాహిత్యాలతో మేళవించి హరికథారూపంగా నూతన ప్రక్రియరూపొందించడం జరిగింది. అంతేకాక వారు హరికథలో రాగ, తాళ, హావభావాలకు కూడా స్థానము కల్పించి హరికథ కళకు ఒక ప్రత్యేకతను రూపొందించారు. తరువాత శ్రీ పరిమి సుబ్రహ్మణ్య భాగవతార్, శ్రీ పెద్దింటి సూర్యనారాయణ భాగవతార్ గార్లు ఈ కళలో విశేష కృషి చేసేరు. హరికథ పండితులను, పామరులను ఆకర్షించే కళ. ముఖ్యంగా ప్రజలలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించుటకు ఈ కళ ఎంతో తోడ్పడుతుంది.



భక్తి తత్వమే ప్రధానంగా తొలుత హరికథ ఆవిర్భవించింది. హరి అనగా విష్ణువు విష్ణువు కథలను ఎక్కువగా గానం చేయడం వల్ల హరికథ అని పేరువచ్చింది. కాలక్రమేణా శివకేశవ బేధాలుపోయి అన్ని పురాణ గాథలు హరికథలుగా చెప్పబడుతున్నాయి. దరిమిలా కాలంగడచిన కొద్దీ ఇతిహాస, చారిత్రక, సాంఘిక గాథలు కూడా హరికథలుగా చెప్పబడుచున్నాయి.. హరికథ చెప్పే కళాకారుడు పట్టుపంచె కట్టుకొని, మెడలో ఒక పూలమాల, కాళ్లకు గజ్జెలు, చేతిలో చిరతలు, నుదుట నామం ధరించి కథ చెబుతారు. మృదంగం, వయోలిన్, హార్మోనియం ఈ కళాకారునికి వాద్యసహకారం అందిస్తారు. హరికథా కళాకారుల వేషం ప్రాంతాన్నిబట్టి కొద్దిగా మార్పు ఉంటుంది. శ్రోతలను అలరించుటకు ఆధ్యాత్మిక బోధలే కాక ఛలోక్తులు, పిట్టకథలు

కూడా హరికథలో భాగంగా మరియు హరికథా కళారూపం బహుముఖప్రచారం కలిగి ఇంచుమించు అన్ని ప్రాంతాలలోనూ వ్యాపించింది. మహారాష్ట్రలో "అభండ" అని తమిళ, మలయాళ, కన్నడ భాషలలో "కథాకాలక్షేప" మని పిలవబడుతోంది. అలాగే హరిదాసునికి కథకుడు, కథాగానపరుడు, కథాప్రసంజి, దాసు, భాగవతార్, భాగవతి, భగవంతుడు, హరికథా ప్రసంగి అని తమిళనాడులో "భాగవతార్" అని మరాఠీలో "కీర్తనకార్" అని పిలుస్తారు.

వీటిలో రామాయణ మహాభారతాలకు సంబంధించిన కథలు ఎక్కువగా ఉంటాయి. రాత్రి ప్రశాంతవాతావరణంలో గుడిలో హరిదాసుగారు చెప్పే హరికథను గ్రామప్రజలందరూ ఏకాగ్రతతో వినుట వల్ల హరిదాసు చెప్పే మంచిమాటలన్నీ సూచనల వలే వారి అంతఃచ్ఛేధన మనస్సుపై పనిచేసి, శ్రోతలు తురియావస్థ(హిప్నటిక్ స్టేట్) లోనికి వెళ్లుట జరుగును. అందువలన ఆ మంచిమాటలన్నీ అంతఃచ్ఛేదనమనస్సుపై ముద్రవేయబడి వ్యక్తి మంచినడవడికకు కారణమగుచున్నవి.

10-15 సంవత్సరాల క్రితం వరకు ఎంతో ప్రజాదరణ పొందిన ఈ కళ సినిమా మరియు ముఖ్యంగా టి.వి. ప్రభావం వల్ల మెల్లమెల్లగా ప్రజాదరణ కోల్పోతున్నది. అయినప్పటికీ గ్రామాలలో హరికథ కళ తన పట్టునిలుపుకొంటూ శ్రీరామనవమి ఉత్సవం, నవరాత్రులు మొదలగు పండుగ రోజులలో హరికథా కాలక్షేపాలు జరుగుచున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని కపిలేశ్వరపురంలో హరికథ ఉచితపాఠశాల ఉన్నది. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఎస్.వి. యూనివర్శిటీలో కూడా హరికథలు ఉచితంగా నేర్పుచున్నారు.

ప్రస్తుతం సుమారు 1000 మందిపైన హరికథా కళాకారులు ఉన్నారని తెలుస్తుంది. వీరిలో శ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి, శ్రీ బుర్రా శివరామ కృష్ణ శర్మ భాగవతార్, శ్రీ జె. సింహాచల శాస్త్రి, శ్రీ కొచ్చెర్ల కోట రామకృష్ణ , శ్రీమతి కె ఇందిరబాల, శ్రీ బాల సుందరం, శ్రీమతి మల్లీశ్వరి మరియు లాగే అనేక మంది ప్రముఖులు ఉన్నారు. మన హరికథలకు తమిళనాడులో మంచి ఆదరణ లభిస్తుంది. తమిళనాడులోని మీనా స్వామినాధన్ వారు మన హరికథా కళాకారులను ఆహ్వానించి ఆ కళలోని మెళుకువలను తెలుసుకొనుటకు ఉత్సాహం చూపుచున్నారు.

భారత స్వాతంత్రోద్యమం కాలంలో జాతీయోద్యమ ప్రచారం కోసం శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్ గారు హరికథలను ప్రోత్సహించినట్లు తెలుస్తోంది.